
క్లుప్తంగా

చైర్‌పర్సన్‌ను కలిసిన సీఈఓ



నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను శుక్రవారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేస్తున్న విద్యారమ బదిలీ కావడంతో డిప్యూటీ సీఈఓకు సీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్



నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగరాధ్యక్షుడిగా బొబ్బాల శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎన్‌ఎంసీలో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాల నుంచి పలువురు అధికారులు నెల్లూరు నగరపాలక సంస్థలోని పలు విభాగాలకు బదిలీ వచ్చారు. శుక్రవారం ఎన్‌ఎంసీలోని ఆయా విభాగాల్లో వారంతా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బీఎంవీ నరసింహారావు, ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఈఈగా అనిల్‌కుమార్ అలాగే ఏఈగా అర్పిత, పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా రఘునాథరావు, ఎఫ్‌ఏసీ ఎగ్జామినర్‌గా డి.సింహాద్రి బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు వారు కమిషనర్ నందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై కత్తితో దాడికి యత్నించగా అడ్డువెళ్లిన వ్యక్తికి గాయమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరానికి చెందిన కృష్ణ మూలాపేట రావిచెట్టు సెంటర్లో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇరుగోళమ్మ సంఘానికి చెందిన వేణు అనే వ్యక్తి గురువారం సాయంత్రం బైక్ రిపేర్ చేయించుకునేందుకు అక్కడికొచ్చాడు. కృష్ణ వస్తువులు తెచ్చుకోవాలని సూచించగా సదరు వేణు అతడితో గొడవకు దిగాడు. షాప్‌లో ఉన్న కృష్ణ బావమరిది వెంకటేష్, పనిచేస్తున్న మరో వ్యక్తి వేణుని అడ్డుకున్నారు. దీంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి అనంతరం వేణు తిరిగి షాపు వచ్చి కృష్ణపై కత్తితో దాడికి యత్నించగా వెంకటేష్ అడ్డుకోవడంతో అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేష్ చేతికి స్వల్ప గాయమైంది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులకు అభినందన



అధికారులతో కమిషనర్ తదితరులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో సిటీ సర్వేయర్‌గా, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ఎగ్జామినర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన సోమేశ్వరరావు, ప్రదీప్ కుమార్, మహమ్మద్ రఫీలు శుక్రవారం కమిషనర్ వైఓ నందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న వారంతా కార్పొరేషన్‌లో ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురిలు వారిని సన్మానించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): నగరంలోని తిక్కన పార్కు వద్ద పెన్నా నదిలో గుర్తుతెలియని మృతదేహం ఉందని రంగనాయకులపేట ఇసుకడొంక 52 – 1 సచివాలయం వీఆర్వో ఎస్కే సందానీబాషాకు స్థానికులు శుక్రవారం సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానికుల సహకారంతో వెలికి తీయించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలా వదిలేశారు!

- మట్టిలో కలిసిపోతున్న ఎన్‌ఎంసీ వాహనాలు
- పాత మున్సిపల్ కార్యాలయం, పాత టీబీ హాస్పిటల్ ప్రాంగణంలో ఎన్నో..
- ప్రజలపై అదనపు భారం



పాత మున్సిపల్ కార్యాలయం వాటర్ ట్యాంక్ వద్ద ఇదీ పరిస్థితి

నెల్లూరు(బారకాసు): కారణం ఏమైనా కావచ్చు.. వాహనం ఎన్ని రూ.లక్షలైనా అవ్వొచ్చు.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన వాహనాలు పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంగణం, పాత టీబీ హాస్పిటల్ ప్రాంగణాల్లో మట్టిలో కలిసిపోతున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. వేలంపాట తరలించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రజాధనం మట్టిపాలై పోతోంది.

ఎన్‌ఎంసీలో పరిస్థితి ఇలా..

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 54 డివిజన్లు, 166 సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో చెత్త తరలించే, రోడ్లు శుభ్రం చేసే, అధికారులు వినియోగించే వాహనాలు దాదాపు వందల సంఖ్యలో ఉన్నాయి. ఒక్కొక్కటి దాదాపు రూ.లక్షల్లో విలువ ఉంటుంది. కొన్ని మరమ్మతులకు గురై దశాబ్దాల కాలం నుంచి మూలన పడ్డాయి. అయితే సంబంధిత నగరపాలక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడమో.. లేక పనికిరాకుంటే వేలం ద్వారా విక్రయించవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల విలువైన వాహనాలు మట్టిలో కలిసిపోకుండా సంస్థకు రాబడి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అనేక వాహనాలు రూపురేఖలు కోల్పోయి ఆయా ప్రాంగణాల్లోనే సమాధి అవుతున్నాయి.

ఆసక్తి చూపని వైనం

మరమ్మతులకు గురైనవి, పనికిరాని (శిథిలావస్థకు చేరిన) వాహనాలతోపాటు ఇతర సామగ్రిపై నగరపాలక అధికారులు దృష్టి సారించకపోవడంతో సంవత్సరాల తరబడి ఆయా ప్రాంగణాల్లో ఉన్నాయి. ఎంతో విలువైన ఈ వాహనాలు తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. దాదాపు పదుల సంఖ్యలో ఎన్‌ఎంసీకి చెందిన వాహనాలు మగ్గిపోతున్నాయంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పలు వాహనాలకు సంబంధించి పార్ట్‌లు కూడా చోరీకి గురవుతున్న పరిస్థితులున్నాయి. బ్యాటరీలు, ఇంజిన్లు లేకుండా కనిపిస్తున్నాయి. మూలన పడేసిన ఆయా వాహనాల గురించి పట్టించుకోకపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేలం నిర్వహించి సంస్థకు రాబడి వచ్చేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విలువైన వాహనాలు ఇలా మూలన..



వాహనాలు గాలికి..



పార్కుల్లోని సామగ్రి పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇలా..

రాజరాజేశ్వరి సన్నిధిలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల ఉద్యాపన పూజల్ని విశేషంగా నిర్వహించారు. 28 మంది పాల్గొని అమ్మవారికి చీర, జాకెట్లు, 108 నిమ్మకాయలతో మాల సమర్పించారు. రాహుకాల దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభహారతులు, పల్లకి సేవల్ని విశేషంగా జరిపారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

- డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): రక్తదానంతో నిండు ప్రాణాన్ని కాపాడొచ్చని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 70వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక రంగనాయకులపేటలోని ఆ బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. స్వచ్ఛంద రక్తదానం చేయాలన్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళీనాయక్ మాట్లాడుతూ సమాజ సేవలో తమ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. సుమారు 150 మందికి పైగా ఉద్యోగులు, ఖాతాదారులు రక్తదానం చేశారు.

జిల్లా స్థాయి పాటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఔత్సాహికులతో అధికారులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో యోగాంధ్ర మూడోరోజు పోటీల్లో భాగంగా శుక్రవారం జిల్లా స్థాయిలో పాటల పోటీలను నిర్వహించారు. 60 మంది పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు ఆరుగురిని విజేతలుగా ప్రకటించారు. యోగా స్లోగన్ పోటీల్లో ఒకరు విజేతగా నిలిచారు. వీరందరూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కమిషనర్ నందన్ ప్రకటించారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, డీఎస్‌డీఓ యతిరాజు, యోగా గురువులు పోటీలను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నెల్లూరు టౌన్ ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లో రోడ్డు వెడల్పు చేసిన ప్రదేశాల్లో నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున వెంకటేశ్వరపురం, మెయిన్ రోడ్డు, నల్లకాలువ, ఇస్లాంపేట, పునరావాసకాలనీ, డెయిరీ ప్రాంతం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

- ఉస్మాన్‌సాహెబ్‌పేట, రామ్‌నగర్ విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేస్తున్నందున బ్రాహ్మణవీధి, పుట్టవీధి, ఎన్టీఆర్ లేఅవుట్, రామ్‌నగర్, మసీదు సెంటర్, ఏసీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తారని తెలియజేశారు.
- హరనాథపురం, పినాకినీ అవెన్యూ, ఆకుతోట, సర్వేపల్లి కాలువకట్ట, చిల్డ్రన్స్ పార్క్, మధురానగర్, అపోలో ఆస్పత్రి, అయోధ్య నగర్, మధురానగర్, బలిజపాళెం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.
- సంఘమిత్ర విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, మినీబైపాస్‌రోడ్డు, రవీంద్రనగర్, ఉమ్మారెడ్డిగుంట, వనంతోపు, సంఘమిత్ర స్కూల్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు సరఫరాలో ఉండదన్నారు.
- యనమలవారిదిన్నె, పద్మావతి గ్రీన్‌సిటీ, వడ్డిపాళెం, బలిజపాళెం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.
- శ్రీనివాసనగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్ నగర్, సింహపురికాలనీ, మైపాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.
- **నెల్లూరు(అర్బన్):** రూరల్ నియోజకవర్గంలోని బుజబుజనెల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న శ్రీరామ్‌నగర్, శివాజీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, భగత్‌సింగ్ నగర్, నాగమ్మ కాలనీ, అంబేద్కర్ కాలనీ తదితర పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఏఈ రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హార్టికల్చర్ అధికారి నియామకం



బీఎంవీ నరసింహారావు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ (ఉద్యాన శాఖ) అసిస్టెంట్ డైరెక్టర్‌గా బీఎంవీ నరసింహారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో ఇప్పటి వరకు ఏడీ హార్టికల్చర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను విజయవాడలోని ఔషధ సుగంధ ద్రవ్యాల విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ అధికారిగా నియమించారు.

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న బిషప్ ఆంథోని దాస్

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జీసస్ సెంటర్‌లో గ్రేస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రిరైట్ లైఫ్ సౌజన్యంతో ఆర్‌డబ్ల్యూ 4 జీజీఎం రెవరెండ్ డి.ఏసుపాదం ఆధ్వర్యంలో నాలుగురోజులుగా జరుగుతున్న 'అడల్ట్ లిటరసీ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం' శుక్రవారంతో ముగిసింది. బిషప్ పి.ఆంథోని దాస్ హాజరై జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులు ప్రారంభించి, దిశానిర్దేశనం చేశారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ జాన్సన్, మిషన్ డైరెక్టర్ రిబేకా, జార్జివిల్సన్, శ్రీనివాస్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ పాల్గొన్నారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి, దేశ ప్రగతి తదితర విషయాలను వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మనుబోలు బాలికలు

మనుబోలు: మనుబోలుకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపికయ్యారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో 19 ఏళ్ల లోపు విభాగంలో మనుబోలుకు చెందిన తాంబరపు లక్ష్మీసాహితి, బండికట్టు ఉషారాణి రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మలేరియా నిర్మూలనకు కృషి



నీటిని పారబోస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ విభాగం సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. మలేరియా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పీసీనాయుడు వీధి పట్టణ ఆరోగ్య కేంద్రం, జాఫర్ సాహెబ్ కెనాల్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునరావు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియాను అంతం చేయొచ్చన్నారు. చలి, జ్వరంతో కూడిన లక్షణాలుంటే మలేరియా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలోని ఇళ్లను సర్వే చేసి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సునీల్, మలేరియా నివారణ సిబ్బంది శ్యాంసన్‌బాబు, రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ చాణక్య, సబ్‌యూనిట్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యశాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం 19 సబార్డినేటర్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లకు డీఎంహెచ్‌ఓ సుజాత ఆధ్వర్యంలో నెల్లూరు సంతపేటలోని కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీని బట్టి బదిలీల్లో ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేస్తున్నామన్నారు. ఒక్కో జు ఒక్కో విభాగానికి చెందిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానించిన ప్రిన్సిపల్ తదితరులు

నెల్లూరు(టౌన్): స్థానిక కేఏసీ జూనియర్ కళాశాలలో చదివి రాష్ట్ర ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ షేక్ అక్బర్, 978, యోషిక 946 మార్కులు సాధించి అవార్డులకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికృష్ణ, చెంచయ్య, పాటూరు వేణుగోపాల్‌రెడ్డి, పెద్ద అప్పలనాయుడు, సంజయ్‌బాబు, హరికృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నెల్లూరు(టౌన్): విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని హరనాథపురంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రకరకాల పేర్లతో పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి అధిక సంఖ్యలో ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆయా విద్యాసంస్థల్లో పుస్తకాలను విక్రయిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడా మౌలిక వసతులు కనిపించవన్నారు. దీనిపై డీఈఓ బాలాజీరావు, ఆర్ఐఓ వరప్రసాదరావులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా వారు మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పవన్ కిశోర్, మస్తాన్ షరీఫ్, నాయకులు శివంవర్మ, యస్దానీ, జీవన్, గోవర్ధన్, పండు, ఇమ్రాన్, వైభవ్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన విద్యార్థి విభాగం నాయకులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి శుక్రవారం విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆ పార్టీ వర్సిటీ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జిల్లా వ్యాప్తంగా యోగా ప్రదర్శనలు నేడు

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: ప్రీ ఇంటర్నేషనల్ యోగా డే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గుర్తించబడిన అన్ని 2,270 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో రిజిస్టర్ చేయబడిన ప్రదేశంలో కార్యక్రమం జరగాలని, దీనిపై ర్యాంకింగ్ ఇస్తామన్నారు. అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసం ఎక్కువ చోట్ల యోగా నిర్వహించడం జరుగుతుందన్నారు. సచివాలయాల ఉద్యోగులు, మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. యోగాడే కార్యక్రమంలో సుమారు 2.85 లక్షల మంది పాల్గొంటున్నారన్నారు. ప్రతి మండలానికి రూ.25 వేలు కేటాయించడం జరిగిందన్నారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం ఉదయం ఏడు గంటలకు జరుగుతుందని వెల్లడించారు.

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని శ్రీవాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక జరుగుతుందని కార్యనిర్వాహకుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల పరిధిలోని వధూవరులకు సంబంధించిన వివరాలతో తల్లిదండ్రులు వస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పది' విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు గణేష్ సేవా మిత్ర మండలి, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన నెహెల్ పార్కత్ (591), నవ్యకుమారి (580), మహేష్ (563)కు రూ.10 వేల చొప్పున నగదు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. నేదురుమల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గణేష్ సేవా మిత్ర మండలి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, క్లబ్ సభ్యులు సుబ్బారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.